నమస్తే తెలంగాణ

మహబూబ్‌నగర్

నారాయణపేట

5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 30 ఆగస్టు 2024 | MAHABUBNAGAR NARAYANPET






నేలమట్టమైన బోజ్యానాయక్ ఇల్లు

భార్య, కూతురుతో బోజ్యానాయక్



# పేదల సౌధంపైకి బుల్డోజర్

## పాలమూరులో 75 ఇండ్లు కూల్చివేత




- రెవెన్యూ అధికారుల హైడ్రా అవతారం
- ఆర్డీవో, డీఎస్పీ సమక్షంలో కట్టడాలు నేలమట్టం
- మరుగుజ్జులు.. దివ్యాంగుల ఇండ్లు సైతం కూల్చివేత
- రాత్రంతా జాగరణ.. కలెక్టరేట్ ఎదుట ధర్నా
- 20 ఏండ్ల నుంచి ఆక్రమణలు కనిపించలేదా..? అంటూ నిలదీత

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, ఆగస్టు 29 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని క్రిస్టియన్‌పల్లిలో అక్రమ నిర్మాణాల పేరిట రెవెన్యూ అధికారులు అర్ధరాత్రి పలు ఇండ్లను కూల్చివేశారు. సర్వే నెంబర్ 523లో ఉన్న 70కి పైగా ఇండ్లను బుల్డోజర్లు, జేసీబీలతో సాయంతో నేలమట్టం చేశారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ శాఖలు సంయుక్తంగా గురువారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో మహబూబ్‌నగర్ అర్బన్ తాసీల్దారు, రెవెన్యూ అధికారులు ఈ చర్యలకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. నేలమట్టం అయిన వాటిలో 25 నిర్మాణాలు దివ్యాంగులు, అంధులకు సంబంధించినవే ఉండటం విశేషం. ఏదిఏమైనా అక్రమ నిర్మాణాల పేరిట కూల్చివేతలో నిరుపేదలే సమిధలుగా మిగిలారు.

**సూత్రధారులను వదిలి..**

అక్రమ నిర్మాణాల పేరిట ఇండ్లను కూల్చివేసిన అధికారులు అసలు సూత్రధారులను వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వే నెంబర్ 523లో ఇండ్లు నిర్మించుకున్న వారిలో ఎక్కువగా పేదలే ఉన్నారు. వారిలో చాలా వరకు మధ్యవర్తుల ద్వారా భూమి పట్టాలు కొనుగోలు చేసిన వారుండగా.. కొందరు దివ్యాంగులు ఉన్నారు. సర్వే నెంబర్ 523లో రాత్రికి రాత్రే అధికారులు 75 ఇండ్లను కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాల్లో నకిలీ పట్టాలు సృష్టించి తాత్కాలిక నిర్మాణాలు చేపట్టిన వాటినే తాము కూల్చివేశామని అధికారులు అంటుండగా.. అందులో 25మంది దివ్యాంగులు కాగా.. 50 మంది ఇతరులు ఉన్నారు. వీరిలో చాలా మంది ఇతరుల నుంచి భూమి కొనుగోలు చేసి పట్టాలు పొందినట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధులు, కొందరు రెవెన్యూ అధికారుల మద్దతుతో కొందరు దళారులు, మధ్యవర్తులు కలిసి భూ మాఫియాగా ఏర్పడి ఒక్కో ప్లాటు కు రూ.70వేల నుంచి రూ.3.50లక్షలు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో పాలమూరు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, దళారులు, యూనియన్ల పేరు చెప్పుకుని తిరిగే వారు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. దొంగ పట్టాలు సృష్టించడం, మున్సిపాలిటీలో ఇంటి నెంబర్‌కు దరఖాస్తు చేసుకోవడం, పన్ను చెల్లించడం దగ్గర నుంచి అన్నీ వీరే చూసుకుంటారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పట్టాల వ్యవహారంలో రూ.5కోట్లకు పైగానే చేతులు మారినట్లు తెలుస్తోంది.

**గతంలో అనర్హులకు పట్టాలు**

523 సర్వే నెంబర్‌లో 83.28ఎకరాల ప్రభుత్వ స్థలం ఉండగా 2,400 మందికి పట్టాలు ఇచ్చినట్లు రికార్డుల్లో ఉండటంతో 2017లో అధికారులు విచారణ చేశారు. 586 పట్టాలు సక్రమమని గుర్తించి వారికి డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి ఇచ్చారు. 75మంది దివ్యాంగులకు పట్టాలను ఇచ్చారు. మిగతా స్థలాన్ని భూ మాఫియా దొంగ పట్టాలతో విక్రయిస్తోంది. ఈ తతంగం గత కొన్నేళ్లుగా కొనసాగుతున్నా.. అధికారులు ప్రతిసారి చర్యలు చేపడతాం.. అక్రమార్కుల పనిపడతాం.. అంటూ మాటలు చెప్పడం తప్పితే చర్యలు తీసుకోలేదు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ హయాంలో జారీ చేసిన పట్టాలపై అధికారులు చర్యలు చేపట్టడం విశేషం.



ఆదర్శనగర్‌లోని నేలమట్టమైన ఇల్లు



ఇల్లు కూల్చడంతో సామాను వెతుకుతున్న గృహిణి

పాలమూరులో నిరుపేదలే సమిధలు

ఎవరిని కదిలించినా కన్నీటి ప్రవాహమే..



## ఎట్లా బతకాలె..

- ఇంటి కూల్చివేతతో సర్వం పోగొట్టుకున్నా..
- మరుగుజ్జు బోజ్యా నాయక్ దంపతుల ఆవేదన

తాము ఎంతో కష్టపడి.. కడుపు మాడ్చుకుని.. ఒక పూట తిని.. మరోపూట పస్తులుండి.. మా ఇద్దరు బిడ్డలకు ఇంత గుడిసె వేసి ఇద్దామని పైసా.. పైసా కూడబెట్టి కట్టిన ఇంటిని అధికారులు నిర్దాక్షిణ్యంగా కూల్చివేశారు.. మేము పూర్తిగా రోడ్డు మీదికొచ్చాం. సామాన్లు లేవు.. మాకు ఇద్దరు ఆడపిల్లలే... ఏడ ఉండాలె.. ఏడ పండుకోవాలే.. పది హేనేండ్లుగా లేనిది.. ఇప్పుడెట్లా కూలకొట్టింద్రు.. ఇంటి ట్యాక్స్, నల్లా బిల్లు కడుతున్నాం.. అయినా ముందుగా చెప్పాలి కదా'.. అని మరుగుజ్జు, దివ్యాంగులైన భార్యాభర్తలు బోజ్యానాయక్, భామిని కన్నీరు పెట్టుకున్నారు.

## ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధం

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- కూలిన ఇండ్ల పరిశీలన

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఆగస్టు 29 : గురువారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మహబూబ్‌నగర్ పట్టణంలోని సర్వే నెంబర్ 523లో అధికారులు కూల్చివేసిన ఇండ్ల బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా భోజ్యానాయక్, బామిని దీన దుస్థితిని చూసి మాజీ మంత్రి చలించిపోయారు. భోజ్యానాయక్, బామిని మాట్లాడుతూ తమకు దేవుడే అన్యాయం చేశాడంటే.. ఇప్పుడు అధికారులు కూడా మా ఇంటిపై దాడి చేసి బతుకు లేకుండా చేశారని వాపోయారు. తమకు ఇద్దరు ఆడపిల్లలు అఖిల, భానుప్రియ ఉన్నారని, వారి భవిష్యత్‌కు ఏం చేసే పరిస్థితి లేదని, ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

**ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధం**

సర్వే నెంబర్ 523లో ఇండ్లు కోల్పోయిన బాధితులకు వెంటనే పునరావాసం కల్పించకపోతే తాను ఆమరణ నిరాహార దీక్షకు అయినా సిద్ధం అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. దివ్యాంగుల సంక్షేమంలో భాగంగా మేం పింఛన్ నాలుగు వేలు చేస్తే వాళ్లేమో ఇండ్లు కూలగొడుతున్నారని ఎద్దేవా చేశారు. మీ తరఫున నేను నిరాహార దీక్ష చేస్తానని మాజీ మంత్రి హామీ ఇచ్చారు.కాళ్లు, కళ్లులేని వారి ఇంటిని కూలగొడతారా.? అని మాజీ మంత్రి ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ఈ కాలనీలో రోడ్లు, వీధి దీపాలు, మిషన్ భగీరథ నీటిని సైతం బీఆర్ఎస్ హయాంలో అందించామన్నారు. దివ్యాంగుల ఇండ్లు కూలగొడితే వాళ్లు ఎక్కడ ఉంటారో అని కనీస ఆలోచన చేయకపోవడం బాధాకరం అన్నారు. పునరావాసంతోపాటు భోజన, వసతి సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ స్పందించి వెంటనే తగు చర్యలు చేపట్టాలన్నారు. దొంగపట్టాలు ఉంటే వీళ్లకు ఇచ్చిన వాళ్లమీద కేసులు పెట్టాలి కానీ పేదలకు అన్యాయం చేయొద్దన్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే మేం అధికారంలోకి వచ్చాక కూలగొట్టిన చోటే ఇండ్లు నిర్మించి ఇస్తామని చెప్పారు.

### కలెక్టరేట్ ఎదుట ధర్నా

సర్వే నెంబర్ 523లో తాము ఎన్నో ఏండ్లుగా నివాసం ఉంటూ మున్సిపాలిటీ ద్వారా ఇంటి నెంబర్లు పొంది, విద్యుత్ మీటర్లు తీసుకొని.. పన్నులు కడుతున్నా.. అధికారులు ఇప్పుడు అక్రమ నిర్మాణాలు ఇండ్లను కూల్చివేయడం దుర్మార్గమైన చర్య అంటూ బాధితులు గురువారం కలెక్టరేట్ ,ఆదర్శనగర్ కాలనీ బ్లైండ్ లేమ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎదుట హ్యాండీక్యాప్డ్ అసోసియేషన్ నాయకులు, బాధితులు ఆందోళన చేపట్టారు. ఉమ్మడి జిల్లావాసి సీఎం అవుతున్నాడని సంతోషపడితే దివ్యాంగులపైకి 500 మంది పోలీసులను అర్ధరాత్రి పంపించి కొట్టి.. ఇలా ఇండ్లు కూల్చడం దారుణమన్నారు. రాబోయే రోజుల్లో మళ్లీ బీఆర్ఎస్ వస్తోందని అన్నారు. తమ ఇండ్లను కూల్చిన తాసీల్దార్‌ను సస్పెండ్ చేయడంతో పాటు అర్ధరాత్రి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కూల్చివేసేందుకు వచ్చిన అధికారులపై చర్యలు తీసుకొని కూల్చివేతకు వినియోగించిన యంత్రా లను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.



పాలమూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు



**సమాచారం ఇవ్వకుండానే..**

సర్వే నెంబర్ 523 ఇండ్ల నిర్మాణాలు కూల్చివేత విషయంపై రెవెన్యూ అధికారులు మాకు సమాచారం ఇవ్వలేదు. బ్లైండ్‌లేమ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఫిజికల్ హ్యాండ్‌క్యాప్ట్) రిజిస్ట్రేషన్ నెం. 122/79కి 2001లో 83 ప్లాట్లు అప్పట్లో అధికారులు కేటాయించారు. అంధులు, చెవుడు, మూగ, ఫిజికల్ హ్యాండ్‌క్యాప్ట్ వాళ్లు ఇండ్లు కట్టుకోవచ్చని చెప్పారు. వాళ్లు ఇచ్చిన లేఅవుట్ ప్రకారమే ప్రస్తుత నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

- ఎల్లయ్య, బ్లైండ్‌లేమ్ వెల్ఫేర్ గౌరవ సలహాదారు



**కూలీకష్టం చేసుకునేటోళ్లం సారూ**

గతంలో పట్టాలు ఇస్తామని మా కాగితాలు అన్ని తీసుకున్నారు. ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారయ్యా.! ఇంటి ట్యాక్సీ, కరెంట్ బిల్లు, ఆధార్, ఓటరుకార్డు అన్నీ ఉన్నాయి. అయినా అధికారులు కనికరించలేదు. జీవో నెం.59 కింద సైతం దరఖాస్తు చేసుకున్నాం. మాకు న్యాయం చేయాలి సార్.

- కుర్వ సత్యమ్మ, ఆదర్శనగర్, మహబూబ్‌నగర్



**కాళ్లు మొక్కుతామన్నా కనికరించలే..**

పేదోళ్లం సారూ.. కాళ్లు మొక్కుతాం అంటే కూడా కనికరించలే.. ఇంట్ల మోటార్ సైకిల్, సామాను ఉండగానే కూల్చేశారయ్యా. ఇప్పటికే మూడుసార్లు విచారణ చేశారు. రెవెన్యూ ఆఫీసోళ్లే వచ్చి ఇంకా ఇంత వరకే కట్టు.. ఆపై కట్టుకోకు.. పక్కలకు జరగకు అని చెప్పింద్రు.. ఇప్పుడు రాత్రికి రాత్రే కూల్చేశారయ్యా.!

-మిరియాల పద్మ, మహబూబ్‌నగర్



**కాంగిరేసు అంటూ తిరుగుతాడు**

మా ఆయన కాంగ్రేసేయననే..! మా కాంగిరేసు అంటూ తిరిగాడు.. ఇప్పుడు ఉండనీకే గూడు లేకుండా చేసింది. నా కుడికాలు విరగడంతో రాడ్డేశారు. ఇబ్బంది అయితే నిన్న దవాఖానకు పోయా.. డాక్టర్లు పరీక్షలు చేసింద్రు.. రిపోర్టులు వచ్చాక ఏం చెబుతారో అని అక్కడే ఉంటి. మీ ఇళ్లు కూలగొట్టింద్రు అంటూ ఫోన్ రావడంతో ఇక్కడికి వస్తే కన్నీరు ఆగడం లేదయ్యా.. కడుపుమాడ్చుకుని కట్టుకున్నాం.

- ఉప్పరి లలిత, ఆదర్శ నగర్, మహబూబ్‌నగర్



**చట్టం ముందు మానమే**

సర్వే నెంబర్ 523లో అక్రమాలపై ఫిర్యాదు చేసింది కూడా పేదలే.. పలు దఫాలుగా విచారణ చేసి పరిశీలించి 75తాత్కాలిక నిర్మాణాలు ఎవరూ నివాసం లేని ఇండ్లను పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ శాఖలు సంయుక్తంగా కూల్చివేశాం. వీటికి ఎలాంటి పట్టాలు రెవెన్యూ అధికారులు జారీ చేయలేదు. కొందరు ఇక్కడ మీరు కట్టుకోండని చెప్పి.. వాళ్లతో డబ్బులు వసూలు చేసి వారికే అమ్మినట్లు మా దృష్టికి వచ్చింది.

- ఘన్సీరాం, తాసీల్దార్

## దైవదర్శనానికి వెళ్లొస్తుండగా..

- ఆగిఉన్న డీసీఎంను ఢీకొన్న కారు
- ముగ్గురు అక్కడికక్కడే మృతి
- చికిత్స పొందుతూ మరొకరు..
- ఇద్దరికి తీవ్ర గాయాలు
- అందరూ ఒకే కుటుంబసభ్యులు



తాటికొండ స్టేజీ వద్ద నుజ్జునుజ్జయిన కారు

భూత్పూర్, ఆగస్టు 29 : దైవదర్శనానికి వెళ్లొస్తున్న వారిని మృత్యువు కబళించింది.. మహబూబ్‌నగర్ జిల్లాలోని హైవే-44పై ఘోర రోడ్డు ప్రమాదానికి గురై నలుగురు దుర్మరణం చెందగా.. ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన చోటు చేసుకున్నది. వివరాలిలా.. హైదరాబాద్‌లోని సైదాబాద్ పరిసరాల్లోని మాధన్నపేటకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిది మంది కారు(టీఎస్ 07 హెచ్‌ఎక్స్ 5399)లో మూడ్రోజుల కిందట తిరుపతి వెంకన్న దర్శనానికి బయలుదేరారు. అనంతరం తిరిగొస్తుండగా.. గురువారం ఉదయం భూత్పూరు మండలం తాటికొండ స్టేజీ సమీపంలో రోడ్డు పక్కనే ఆగి ఉన్న డీసీఎం (ఎంఏ 40 వై 9758)ను వెనుక నుంచి వీరి వాహనం బలంగా ఢీకొట్టింది. దీంతో కారు నుజ్జునుజ్జయ్యింది. ఎల్అండ్‌టీ సిబ్బంది క్రేన్ సాయంతో కారులోంచి మృతదేహాలను బయటకు తీశారు. కారు డ్రైవర్ అశోక్ యాదవ్(45), గోనెల వెంకట రమణ(43), ఉరుసుల కెంపురావు(78) అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడ్డ వారిని ఎల్అండ్‌టీ సహకారంతో అంబుల్‌లెన్స్‌లో మహబూబ్‌నగర్ దవాఖానకు తరలించారు.. అక్కడ చికిత్స పొందుతూ ఉరుసుల వెంకట రామారావు (44) మృతి చెందాడు. అదేవిధంగా కారులో ఉన్న సువర్ణలక్ష్మి, అంబికకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరు చిన్న పిల్లలు అక్షిత, శ్రేయ అగ్రణ్యకు స్వల్ప గాయాలయ్యాయి. కాగా జాతీయ రహదారి పక్కన డీసీఎం డ్రైవర్ ఎలాంటి నిబంధనలు పాటించకుండా అజాగ్రత్తగా వాహనాన్ని నిలిపినందుకే ప్రమాదం చోటు చేసుకున్నదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. రోడ్డుపై ఎక్కువ సమయం ట్రాఫిక్ నిల్వకుండా ఎల్అండ్‌టీ, ఎస్సై చర్యలు చేపట్టారు.

## టార్గెట్ బాల్ రెఫరీగా నల్లమల వాసి



అచ్చంపేటరూరల్, ఆగస్టు 29 : జాతీయ స్థాయి టార్గెట్ బాల్ పోటీలకు రెఫరీగా నల్లమలవాసి మండలంలోని దేవులతండాకు చెందిన సభావత్ బాబూనాయక్ ఎంపికయ్యాడు. నేటి నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లా రాయచోటిలోని అర్చన కాలేజ్‌లో నిర్వహించే సెకండ్ సౌత్‌జోన్ టార్గెట్ బాల్ టోర్నమెంట్‌కు రెఫరీగా ఎన్నికైనట్లు తెలంగాణ టార్గెట్ బాల్ అసోసిమేషన్ అధ్యక్షుడు వినోద్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రేవంత్ ఉత్తర్వులో పేర్కొన్నట్లు గురువారం ప్రకటనలో బాబూనాయక్ తెలిపారు. బాబూనాయక్ తెలంగాణ నుంచి ఎంపిక కావడంపై మాజీ సర్పంచ్ భారతిపంతునాయక్ అభినందించారు.



శాఖాపూర్ చెక్‌డ్యాంలో పూలుచల్లి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

## చెక్ డ్యాంలతో భూగర్భజలాలు పెంపు

- దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మూసాపేట, ఆగస్టు 29 : చెక్ డ్యాం నిర్మాణాలతో భూగర్భ జలాలు పుష్కలంగా పెరుగుతాయని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. అడ్డాకుల మండలంలోని శాఖాపూర్ గ్రామంలో కేసీఆర్ ప్రభుత్వం హ యాంలో రూ.4.79కోట్లతో నిర్మించిన పెద్దవాగుపై చెక్ డ్యాం పనులు ఇటీవలే పూర్తయ్యాయి. మొదటిసారిగా చెక్ డ్యాంలో పూర్తిస్థాయిలో నీరు నిండడంతో గురువారం శాఖాపూర్ తోపాటు కందూరు, గడిబండ, పొనకల్, కొమిరెడ్డిపల్లి గ్రామాల రైతులు పెద్ద ఎత్తున మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్ రెడ్డి ఆహ్వానించి సంబురాలు నిర్వహించుకున్నారు. చెక్‌డ్యాంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు రాజశేఖర్‌రెడ్డి రైతులు, బీఆర్ఎస్ నాయకులు పూలు పసుపు, కుంకుమ పూలతో పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ చెక్‌డ్యాం తోపాటు నియోజకవర్గంలో 30చెక్‌డ్యాంలను నిర్మించామని, అవన్నీ ఇప్పుడు జలకళ సంతరించకున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయన్నగౌడ్, రమేశ్‌గౌడ్, ఖాజ ఘోరీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## రూ.28లక్షలు కాజేసిన సైబర్ మోసగాళ్లు

మహబూబ్‌నగర్, ఆగస్టు 29: మహబూబ్‌నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నుంచి సైబర్ నేరగాళ్లు రూ.28లక్షలు కాజేశారు. ఈ ఘటన ఈనెల 27న గురువారం చోటుచేసుకున్నదని టూటౌన్ సీఐ ఏజాజుద్దీన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని క్రిస్టియన్‌కాలనీకి చెందిన బంగార్ మధుకర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 23న 99023 73145, 92795 86806 నెంబర్ల నుంచి తన ఫోన్‌కు కాల్ రావడంతో ఎత్తాడు. ముంబై అంధేరి ఈస్ట్ క్రైమ్‌బ్రాంచ్ నుంచి అంటూ చెప్పిన సైబర్ కేటుగాళ్లు నీ ఆధార్‌కార్డు చూపాలని కోరారు. పంపిన పది నిమిషాల తర్వాత ఈ కార్డుపై ఐదు మనీ లాండరింగ్ కేసులు ఉన్నాయి. చాలా బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. వాటి నుంచి బయటి దేశాలకు డబ్బు పంపుతున్నావంటూ బెదిరించారు. స్కైప్ ఆన్‌లైన్‌లోకి రా వెరిఫికేషన్ చేయాలంటూ మూడు రోజులుగా లైన్‌లో ఉంచారు. 27వ తేదీన ఎస్‌బీఐ అకౌంట్ నంబర్ 432371 5384కు మధుకర్ ఆక్సిస్ బ్యాంకు ఖాతా నుంచి రూ. 28,42,000 ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. గురువారం ఉదయం వరకు మాట్లాడి తర్వాత ఫోన్ లో స్కైప్ కట్ చేశారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యా దు చేయడంతో కేసు నమోదు చేశామని టూటౌన్ సీఐ ఏజాజ్‌ద్దీన్ తెలిపారు.

## సైబర్ క్రైం ముఠా అరెస్ట్

- 26 ఫోన్లు, 22 సిమ్‌కార్డులు, రూ.85వేల నగదు జప్తు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రావుల గిరిధర్



నేరస్తుల అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రావులగిరిధర్

వనపర్తి,ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ) : వివిధ ప్రాంతాల్లో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముఠా ను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ రావుల గిరిధర్ వెల్లడించారు. ఈమేరకు గురువారం బృందంలోని 8 మం దిని అరెస్ట్ చేసి వీరి నుంచి 26 సెల్‌ఫోన్లు, 22 సిమ్‌కార్డులు, 5 బైక్‌లు, రూ.85 వేల నగదును స్వాధీ నం చేసుకున్నట్లు చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్పీ రాందాస్ తేజావత్ ఆధ్వర్యంలో ఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గతనెల 11వ తేదీ కొత్తకోటకు చెందిన కుమ్మరి రాజు ఆన్‌లైన్‌లో తాను మోసపోయానని పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. రాజు గత జనవరిలో ఆన్‌లైన్‌లో ముద్ర విశ్వకర్మ రుణం కోసం దరఖాస్తు చేసుకోగా, రూ. 12, 250 పంపిస్తే, మీకు రుణం మంజూరవుతుందంటే నమ్మి డబ్బులు వేశాడు. మళ్లీ రూ.9వేలు వేస్తేనే రుణం వస్తుందని చెప్పడంతో అనుమానం వచ్చి కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు సైబర్ నేరస్తులను గుర్తించడంలో పెద్దమందడి మండలం జంగమాయిపల్లికి చెందిన కురుమూర్తిని ముందుగా అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి అసలు సూత్రధారిగా వ్యవహరించిన వనపర్తిలో ఉండే నర్సింగ్ నాయక్‌ను గుర్తించారు. ఇతని ఆధ్వర్యంలోనే జిల్లా కేంద్రంలో ఓ రూంను అద్దెకు తీసుకొని మరో ముగ్గురు రాత్‌లావత్ రమేశ్, ఇస్లావత్ రాములు, కొత్తపల్లి ఉమేశ్, బోయ వీరేశ్‌లతోపాటు మరో ఇద్దరు మైనర్లను ముఠాగా ఏర్పాటు చేశాడు. నర్సింగ్ నాయక్ బీహార్‌కు చెందిన రోహిత్ అనే వ్యక్తి ద్వారా ముద్ర, ధనిలోన్ యాప్‌ల నుంచి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సమాచార లిస్ట్‌ను సేకరించాడు. ఈ లిస్ట్‌లో ఉన్న వారికి ఫోన్లు చేయించి రుణాలు మంజూరు చేస్తామని నమ్మించి, వివిధ రకాల రుసుముల పేరుతో డబ్బులు వసూలు చేశారు. ఇలా వెయ్యి మంది వరకు ఈ ముఠా సభ్యులు ఫోన్లు చేయగా, 250మంది బాధితులు రూ.20 లక్షల వరకు సైబర్ నేరస్తులకు చిక్కి నష్టపోయారు. ఇలా ఒక్కొక్కరి నుంచి రూ.10 వేలు మొదలుకుని రూ.40 వేల వరకు బురిడీ కొట్టించారు. వచ్చిన డబ్బులను వాటాల వారీగా పంపకాలు చేసుకున్నారు. ఈ కేసును జిల్లా సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ ఎన్‌బీ రత్నం, కేవీఎం ప్రసాద్, డీఎస్పీ వెంకటేశ్వరావు, కొత్తకోట సీఐ రాంబాబు, కొత్తకోట, వీపనగండ్ల, శ్రీరంగాపూర్ ఎస్సైలు మంజునాథ్ రెడ్డి, నందీకర్, వెంకటేశ్వర్లు, సైబర్ సెక్యూరిటీ ఎస్సై ప్రియదర్శిని ఛేదించారని వీరందరిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు ఎస్పీ గిరిధర్ చె ప్పారు. కాగా, నేరస్తుల నుంచి రూ.10 లక్షల విలు వ చేసే ఫోన్లు, బైక్‌లు, రూ.85వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ చెప్పారు. సోషల్ మీడియా ద్వారా వచ్చే సందేశాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏ విషయాన్ని గుడ్డిగా నమ్మవద్దన్నారు. అసత్య ప్రచారాలు, ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా ఉండే వాట్సాప్ మెసేజ్‌లపై జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ సూచించారు.